క్లుప్తంగా

నేడు, రేపు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

కొవ్వూరు: రెండు రోజుల పాటు నిర్వహించే నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం ప్రారంభం అవుతాయని ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. బాలుర కబడ్డీ పోటీలను పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహిస్తామన్నారు. బాలుర ఖోఖో పోటీలు 25న ఇదే క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని చెప్పారు. బాలుర క్రికెట్ పోటీలను బుధవారం కొవ్వూరు-నందమూరు రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో గల మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఇక బాలుర బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం కొవ్వూరులోని అల్లూరి వెంకటేశ్వరరావు ఇండోర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. బాలికల కబడ్డీ పోటీలు బుధవారం స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో జరుగుతాయన్నారు. బాలికల ఖోఖో పోటీలను గురువారం నాడు అదే క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని తెలిపారు. మహిళల వాలీబాల్ పోటీలను కూడా గురువారం అదే ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. ఇక మహిళల క్రికెట్ పోటీలను బుధవారం కొవ్వూరు-నందమూరు రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. ఇక బాలికల బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం కొవ్వూరులోని అల్లూరి వెంకటేశ్వరరావు ఇండోర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిడదవోలు నియోజకవర్గంలో..

నిడదవోలు రూరల్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిడదవోలు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ఈనెల 24 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.శామ్యూల్ మంగళవారం తెలిపారు. నిడదవోలులోని వివిధ క్రీడా మైదానాల్లో ఈనెల 24న వాలీబాల్, 25న ఖోఖో, 27న క్రికెట్, 29న కబడ్డీ పోటీలు జరుగుతాయని ఆయన వివరించారు.

27న మునిసిపల్ బడ్జెట్ సమావేశం

కొవ్వూరు: పురపాలక సంఘం బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు.తొలుత మునిసిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని, అనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు ఆమె వివరించారు. అలాగే పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్టు తెలిపారు.

వ్యక్తిపై కేసు

కొవ్వూరు: పాత గొడవలను పురస్కరించుకుని కొయ్యే ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి సోమవారం రాత్రి తనను కొట్టినట్టు మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన గాడి ఏడుకొండలు కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపారు.

'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని నబీపేట గ్రామానికి చెందిన కూనపాము సుబ్బారావుకు రూ.4000, యంత్రప్రగడ మోహనరావుకు మరో రూ.4000 ఆర్థిక సాయాన్ని మానవత సంస్థ మండల శాఖ మంగళవారం అందజేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ ఆ గ్రామ కన్వీనర్ కాజ మల్లేశ్వర రావు, మండల శాఖ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, కార్యదర్శి ఉప్పాడ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో విద్యార్థులకు పోటీలు

నల్లజర్ల: జాతీయ యువజన వారోత్సవాల సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం దూబచర్లలో ఆటలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు పంచాయతీ కార్యదర్శి బి.రత్నం,అంబటి శ్రీనివాసరావు, హైస్కూల్ పీడీ రాజారావు, నెహ్రూ యువకేంద్ర కో-ఆర్డినేటర్ వెంకటలక్ష్మి బహుమతులు అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

ఉండ్రాజవరం: ఉద్యోగ ప్రయత్నం ఫలించక పోవడంతో మానసిక వేదన చెందిన మండలంలోని చిలకపాడు గ్రామానికి చెందిన కనిపే టైసన్‌బాబు (23) యువకుడు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టైసన్‌బాబు మంగళవారం తెల్లవారుజామున తన ఇంటి వరండా శ్లాబ్ ఇనప కొక్కేనికి చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని స్థానిక ఎస్సై వి.అప్పలరాజు తెలిపారు. మృతుడి తండ్రి కె.ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్‌ను గెలిపిస్తే మళ్లీ స్వర్ణయుగమే

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి
- పార్టీ తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో పరిచయ కార్యక్రమాలు
- పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు



చాగల్లు సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు. చిత్రంలో రాజీవ్‌కృష్ణ, నాయకులు

తాళ్లపూడి: ముఖ్యమంత్రిగా రెండోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు స్వర్ణయుగాన్ని చూస్తారని గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండల విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం స్థానిక సొలస దమయంతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో తలారి మాట్లాడుతూ సీఎం జగనన్న ఆదేశాల మేరకు కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో గతంలో మాదిరిగానే తనను, తానేటి వనితను గెలిపించాలని కోరారు. సీఎం ఆదేశాల మేరకే తాను కొవ్వూరు నియోజకవర్గానికి వచ్చానన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను పరిచయం చేసుకునేందుకు మండలాల వారీగా పర్యటిస్తున్నామని చెప్పారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు ఆయన నియమించిన అభ్యర్థులను గెలిపించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికలకు కేవలం 10 వారాల సమయం మాత్రమే ఉన్నందున ఇప్పటి నుంచీ అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు పార్టీ మండల నాయకులు ఎమ్మెల్యే తలారికి, రాజీవ్‌కృష్ణకు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. వెంకటరావు స్థానిక నాయకులను పేరు పేరునా పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, నాయకులు నక్కా చిట్టిబాబు, యాళ్ల బాబురావు, కొమ్మిరెడ్డి పరశురామారావు, గూడా విజయరాజు, పిట్టా శ్రీనివాస్, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకటరావు, ఎల్లిన శివ, ఎం. దమయంతి, సిద్ధంశెట్టి కృష్ణ, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రెండుచోట్లా గెలిచి జగన్‌కు కానుకగా ఇద్దాం



తాళ్లపూడిలో తలారి వెంకట్రావు, రాజీవ్ కృష్ణలకు వైఎస్సార్ సీపీ నాయకుల సాదర స్వాగతం

చాగల్లు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ గెలుపునకు పాటుపడాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ సీపీ చాగల్లు మండల విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం స్థానిక శ్రీ కృష్ణదేవరాయ కల్యాణ మండపంలో నిర్వహించారు. సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. గతంలో గోపాలపురం నియోజకవర్గంలో చాగల్లు మండలం అంతర్భాగంగా ఉన్నందున ఇక్కడి నాయకులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకూ హోం మంత్రి తానేటి వనితను ఎలా ఆదరించారో, ఇకపై ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కూడా అలాగే ఆదరించాలని కోరారు.

తలారి, రాజీవ్ కృష్ణలకు సన్మానం

పార్టీ సమన్వయకర్తగా నియమితులయ్యాక తొలిసారిగా చాగల్లు వచ్చిన తలారి వెంకట్రావు మండలంలోని వివిధ గ్రామాల వారీగా పార్టీ నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తలారిని, రాజీవ్‌కృష్ణను పార్టీ శ్రేణులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తొలుత చాగల్లు తెలగా సంఘం వినాయకుడి ఆలయం వద్ద వారిద్దరూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, చాగల్లు, నిడదవోలు జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ, కొయ్యే సూరిబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్కూరి దొరయ్య, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు, గూడపాటి శివ, గంగిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో ఇద్దరి చేరిక



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తలారి వెంకట్రావు, రాజీవ్‌కృష్ణ

చాగల్లు: కాంగ్రెస్, టీడీపీలకు చెందిన ఇద్దరు నాయకులు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. చాగల్లులో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పోతురాజు పుల్లారావు, టీడీపీకి చెందిన పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు కరివేదల రత్నరాజు వైఎస్సార్‌సీపీలో చేరగా, వారికి పార్టీ సమన్వయకర్త తలారి, రాజీవ్‌కృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

దేవరపల్లిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

దేవరపల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు పర్యవేక్షించారు. పోటీల్లో విజేతలకు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న బహుమతులు అందజేస్తామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

కాలువపై వంతెన సర్వే పనుల పరిశీలన



చినకాశిరేవులో నిర్మించే వంతెన సర్వే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు మంగళవారం పరిశీలించారు. స్థానిక చినకాశీరేవు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువపై రూ.4.65 కోట్ల వ్యయంతో నిర్మించే వంతెన సర్వే పనులను తొలుత పరిశీలించారు. ఆర్ అండ్ బీ అధికారులకు పలు సూచనలు చేశారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి జగనన్న కాలనీకి వెళ్లిన ఎమ్మెల్యే ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. వీధి లైట్లు, మంచి నీటి సరఫరా విషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులను సూచించారు. పట్టణంలో రూ.5.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న గణపతి సెంటర్ జంక్షన్ అభివృద్ధి పనులు పరిశీలించారు. మున్సిపల్, రుడా అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యాక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఆర్ అండ్ బీ డీఈఈ వెంకటరమణ, ఏఈ శ్రీనివాస్ విజయ్, మున్సిపల్ ఏఈ హేమంత్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగంటి కృపానందం, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, గుర్రం శాంతిశ్రీ , అహ్మదున్నీషాబేగం, బిర్రే పార్వతి, ఎస్‌కే వజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

25న యర్నగూడెంలో మంత్రి వనిత క్యాంప్ ఆఫీసు ప్రారంభం

- అదే రోజు ద్వారకా తిరుమలలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం
- నాయకులతో పరిచయ కార్యక్రమం

కొవ్వూరు: గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత నియమితులైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు దేవరపల్లి మండలం యర్నగూడెంలో తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు మంత్రి తానేటి వనిత తెలిపారు. కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అనంతరం 9.30 గంటల నుంచి యర్నగూడెం నుంచి ద్వారకాతిరుమల వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ద్వారకా తిరుమలలోని కాపు కల్యాణ మండపం ఎదురుగా గల లేఅవుట్‌లో వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించ నున్నట్టు తెలిపారు. కావున నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొనాలని మంత్రి కోరారు. ఈ సమావేశానికి పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) హాజరు కానున్నట్లు తెలిపారు. నాయకుల పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు.

జగనన్న సురక్షలో 409 మందికి వైద్యం



లంకమాలపల్లిలో సురక్ష వైద్య శిబిరంలో రోగులను పరీక్షలు చేస్తున్న వైద్య బృందం



తాడిమళ్లలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, నాయకులు

పెరవలి: పేదలకు కూడా నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. రెండో విడత జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం మండలంలోని లంకమాలపల్లి గ్రామంలో నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ పరిశీలించి రోగులకు మందుల కిట్‌లు అందించారు. ఈ వైద్య శిబిరంలో 409 మందికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో ముగ్గురిని ఉన్నత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం ఆసుపత్రులకు రిఫర్ చేశామని పెరవలి పీహెచ్‌సీ వైద్యురాలు సత్య కృష్ణవేణి తెలిపారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన గైనకాలజిస్టు పార్వతీ భీమ్, జనరల్ సర్జన్ హారిక, ఆప్తమాలజిస్టు ఎన్.సురేష్‌లు రోగులకు వైద్య సేవలు అందించారు. సర్పంచ్ పులిదండి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు కుసుమే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి వార్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాడిమళ్లలో 421 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి మంగళవారం ప్రారంభించారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి టి.ఆండ్రూ ఆల్బర్ట్ లూయిస్ పర్యవేక్షణలో స్పెషలిస్ట్ డాక్టర్లు 421 మంది రోగులను పరీక్షించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్‌లను ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ రాధారాణి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ అన్ని రంగాల్లో వికసిస్తోంది

- కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్
- సమిశ్రగూడెంలో గ్యాస్ కనెక్షన్లు, ఆధార్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

నిడదవోలు రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో అన్ని రంగాల్లో భారత్ వికసిస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కేంద్ర సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించి అమలుపై అధికారులతో మాట్లాడారు.లబ్ధిదారులకు నూతన గ్యాస్ కనెక్షన్లు, ఆధార్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రేలంగి శ్రీదేవి, నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మాట్ల వెంకట దుర్గారావు పాల్గొన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ దర్శించుకుని పూజలు నిర్వహించారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత

పెరవలి: మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తగా నియమితులైన పది మంది గ్రామ వలంటీర్లకు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కానూరు, ముక్కామల పంచాయతీలకు ముగ్గురు చొప్పున, కాకరపర్రు, అన్నవరప్పాడు, పెరవలి, తీపర్రు గ్రామాలకు ఒక్కొక్కరు చొప్పన వలంటీర్లుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, నాయకుడు చెర్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ రమేష్

చాగల్లులో జిల్లా స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు

చాగల్లు: జిల్లా స్థాయి అండర్-13 బాలికల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పల్లంట, దేవరపల్లి, కొవ్వూరు, చాగల్లు జట్లు పాల్గొన్నాయని పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఈ పోటీల్లో చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు జట్లు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించినట్లు చెప్పారు. దాతల సహకారంతో ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులకు క్రీడా సామగ్రి, షూలు, టీ షర్ట్స్, విజేతలకు బహుమతులు అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి వీర్రాజు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు టి.భగవన్, ఎండీ నఫీజ్, లంక జగన్, వ్యాయమోపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికల అండర్-13 ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- చివటంలో ఇంటింటా పర్యటన



చివటంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: ప్రజల సమస్యలు తెలుసుకుని, వెంటనే వాటిని పరిష్కరించడానికే తాను గడప గడపకూ పర్యటిస్తున్నట్టు నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో చివటం గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు కొఠారు సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో ఎమ్మెల్యే వివరించారు. గత ప్రభుత్వానికి, ఇప్పుడున్న జగనన్న ప్రభుత్వానికి తేడాను గ్రామస్తులకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమతాలు, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఆ గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికలల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరామయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, యూత్ అధ్యక్షుడు గంటిన లక్ష్మీగణపతి, గంటిన చిన్న వెంకన్న, గంటిన కోలా లక్ష్మీ గణపతి, అక్కల వెంకటేశ్వరరావు, టి.శ్రీను, కోళ్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండల స్థాయి సమావేశాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తామని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కె.సావరంలో ముగ్గుల పోటీలు

ఉండ్రాజవరం: అయోధ్యలో సోమవారం నిర్వహించిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని కె.సావరం గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొని రంగ వల్లులను తీర్చిదిద్దారు. పోటీల సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన గునా శ్రావణికి ఏడు తులాల సీతారామలక్ష్మణ హనుమాన్ వెండి ప్రతిమను బహుమతిగా అందించారు. ద్వితీయ స్థానం సాధించిన మట్టా ప్రసన్నకు టేబుల్ ఫ్యాన్, తృతీయ స్థానం సాధించిన రామాయణం పావనికి గ్రైండర్, నాల్గో స్థానం సాధించిన వీరవల్లి సంధ్యకు మిక్సీ, ఐదో స్థానంలో నిలిచిన మీసాల అంజలికి కరెంట్ కుక్కర్ బహుమతులుగా అందించారు. ఇక జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా వెంపాలి హాసినికి ఐదు తులాల వెండి కుంకుమభరిణి, ద్వితీయ బహుమతిగా తూము పద్మ ప్రణీతకు మిక్సీ, తృతీయ బహుమతిగా వై.దీపికకు గ్యాస్ పొయ్యి, నాల్గో బహుమతిగా మీసాల జాహ్నవికి కిచెన్ సెట్, ఐదో బహుమతిగా తూము వాహికకు కుక్కర్‌లను పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎస్.రామకృష్ణ, శ్రీముత్యాలమ్మ, కోదండరామ ఆలయ కమిటీల సభ్యులు అందించారు.



ప్రథమ బహుమతిగా శ్రావణికి ఏడు తులాల వెండి ప్రతిమను అందిస్తున్న ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు